అనంతలో డెంగీ కలకలం

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరవింద్ నగర్‌లో ఓ మహిళకు డెంగీ లక్షణాలు కన్పించాయి. రెండు రోజుల క్రితం జిల్లాకేంద్రంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వెనుక ఉన్న అరవింద్ నగర్ లోని 45 ఏళ్ల మహిళకు డెంగీ లక్షణాలు కన్పించడంతో అధికారులు పరుగులు పెట్టారు. ఆ మహిళ గృహానికి వెళ్లిబయట నుంచి ఫోటోలు తీయించారు. ఆ మహిళ గృహ పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్, స్ప్రేయింగ్ జరిపి వచ్చారు.సీజనల్ వ్యాధుల నివారణకై ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను జరుపుతున్నారు అలాగే డెంగీ నిరోధక మాసోత్సవాలను జూలై 1 నుండి 31 వరకు నిర్వహించనున్నారు. పారిశుద్య చర్యలే దోమల నివారణకు మార్గమని ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నివారణ సాధ్యమని అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన గేటుకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. డెంగీ నిరోధక మాసోత్సవాలు ప్రారంభం కాకమునుపే జూన్ నెలలోనే నగరంలో డెంగ్యూ కలకలం రేగడం గమనార్హం.

దర్జాగా కబ్జా...

- కొనుగోలు చేసింది ఒకచోట, కాజేసింది మరోచోట
- అధికారం మాటున ఏకంగా ఇంటి నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో ధైర్యంగా ప్రశ్నిస్తున్న బాధితులు

కబ్జా చేసిన స్థలం

అధికారం కళ్లకెక్కింది... ఆ ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుని విర్రవీగిపోయారు. అందులోనూ ఆ వైసీపీ నాయకుడు ప్రతిపక్షాలను సైతం బెదిరించి తనకు ఎవరు పోటీ లేకుండా కౌన్సిలర్ అయ్యారు.దీంతో అధికారం మరింత మదమెక్కింది. కొనుగోలు చేసిన స్థలం ఎక్కడుందో ఆలోచించలేదు. తనకు నచ్చిన స్థలమే నాస్థలం అనుకున్నారేమో... ఓ వివాదాస్పద స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలం యజమాని ఎంత గగ్గోలు పెట్టిన వినిపించుకోలేని అధికార మదం అకౌన్సిరల్‌ది. అంతేకాదు ఆ స్థలం ఆయన రిజిస్ట్రేషన్ చేసుకోక మునుపు నుంచే ఇద్దరి మధకోర్టులో వివాదం కొనసాగుతోంది. ఎంతో విలువైన స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం సాగించినా బాధితులు వారిని ఎదురించలేని బలహీనులు. ఆ కౌన్సిలర్ కొనుగోలు చేసిన స్థలం హద్దులు ప్రస్తుతం అతను స్వాధీనం చేసుకున్న స్థలం మధ్య హద్దులు తేడా ఉన్నా గమనించకుండానే అధికారం ఉందికదా తనను ఎవరు ఏమిచేయలేరన్న ధైర్యంతో ఖాళీగా కనిపించిన విలువైన స్థలంలో ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ప్రస్తుతం అధికారం మారడంతో బాధితులైన అసలు యజమాని ధైర్యంగా ముందుకు రావడంతో ఆ వైసీపీ కౌన్సిలర్ గుట్టు రట్టు అవుతోంది. ఈ భూ దందా వ్యవహారం ధర్మవరం పట్టణంలోని బాలాజీనగర్‌లో చోటు చేసుకుంది.

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణానికి చెందిన నాగరాజుకుమార్ 494 సర్వేనెంబరులోని 22.72 ఎకరాల పైకి తనకున్న 4సెంట్ల స్థలంతోపాటు మరో ఆరుసెంట్ల స్థలాన్ని 1980 నవంబరు 3వతేదీన రంగన అశ్వర్థనారాయణ, రంగన అచ్చప్పలకు 4 సెంట్లస్థలాన్ని అమ్మేశాడు. ఇందుకు గాను తూర్పున రస్తా, ఉత్తరం రస్తా, దక్షిణం చుక్కలూరి చిన్ననారాయణ, పడమర సిరిపి రామచంద్రప్ప స్థలాన్ని చెక్‌బందీలుగా రిజిస్ట్రేషన్లో పొందుపరిచారు. అయితే 1989లో 494 సర్వేనెంబరులోని 1.86 ఎకరాలపైకి 2 సెంట్ల స్థలాన్ని షేక్‌అల్లాబకాష్ భార్య నసీమ్‌బేగం నుంచి అమీరాబాషా ఉరప్ తాత కొనుగోలు చేశారు. ఈ స్థలానికి గాను తూర్పు, ఉత్తరం రోడ్డు, దక్షిణం సిరిపి మస్తానమ్మ, పడమర బళ్లారి శ్రీరాములు స్థలాన్ని చెక్‌బందీగా రాయించుకున్నారు. ఇదే స్థలాన్ని 2001లో అమీర్ బాషా, ఉరపస్ తాత నుంచి కొనుగోలు చేశారు. తిరిగి 2010 జూన్ 24న గడ్డం కొండన్న కుమారుడు గడ్డం రంగనాథ్ కొనుగోలు చేశారు. రంగన అశ్వర్థనారాయణ, రంగన అచ్చప్ప కొనుగోలు చేసిన స్థలానికి గడ్డం రంగనాథ్ కొనుగోలు స్థలాల మధ్య సర్వేనెంబరు ఒకటే ఉన్నప్పటికీ చెక్‌బందీగా వేరువేరుగా ఉన్నట్టు రిజిస్ట్రేషన్ పత్రాల ద్వారా తెలుస్తోంది. దీంతో గడ్డం రంగనాథ్, రంగన అశ్వర్థనారాయణల మధ్య స్థలం వివాదాస్పదంగా మారింది. అందుకు ప్రధాన కారణం ఆ ప్రాంతంలో మిగిలిన ఉన్న కాళీస్థలం ఒక్కటే కావడం. కొలతలు నిర్వహించి అది ఎవరిదో నిర్ధారించుకోక మునుపే గడ్డంరంగనాథ్ ఆ స్థలం తనదే అంటూ కోర్టును ఆశ్రయించారు. దీంతో రంగన అశ్వర్థనారాయణ, రంగన అచ్చప్పలు కూడా ఆ స్థలం తనదే నంటూ వారు కూడా కోర్టులో పిటిషన్ వేశారు. ప్రస్తుతం అది కోర్టులో విచారణ జరుగుతూ వస్తోంది. అయితే ఆ ప్రాంతానికి చెందిన ఓ కౌన్సిలర్ 2023లో గడ్డం రంగనాథ్‌ను సంప్రదించి వివాదాస్పద స్థలాన్ని తక్కువ రేటుకే కొనుగోలు చేసి కోర్టులో పెండింగ్ ఉన్నప్పటికి రిజిస్ట్రేషన్‌ను భార్య చింతా సరస్వతి పేరిట రాయించుకున్నాడు. అంతటితో ఆగని ఆ కౌన్సిలర్ ఏకంగా ఆ 2సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టి పెద్ద భవంతినే నిర్మించుకున్నాడు. ఆ కౌన్సిలర్‌కు వైసీపీ ప్రభుత్వ అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా ఆ వివాదాస్పదస్థలాన్ని ఆక్రమించుకొని ఇళ్లను నిర్మిస్తున్న ఏమిచేయలేని పరిస్థితి బాధితుల్లో నెలకొంది. ఇదేమని ప్రశ్నించిన బాధితులను బెదిరిస్తుండటంతో ఆకౌన్సిలర్‌కు భయపడి నిస్సహాయులుగా ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అధికారం మారడంతో ఇప్పుడిప్పుడే బాధితులు ఒక్కొక్కరు బయటకు వస్తున్నారు. తాజాగా రంగన అశ్వర్థనారాయణ, రంగన అచ్చప్ప కూడా వైసీపీ ప్రభుత్వంలో తాము నష్టపోయిన వైనాన్ని ముందుకు వచ్చి వివరించే పరిస్థితి ఏర్పడింది.

కోర్టు పరిధిలో ఉన్నా లెక్కచేయని కౌన్సిలర్

పట్టణంలోని బాలాజీ నగర్ లోని 494 సర్వేనెంబరులో 4 సెంట్ల స్థలానికి సంబంధించి రెండుకుటుంబాల మధ్య వివాదం నెలకొంది. దీంతో 2021లోనే కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టులో వ్యవహారం నడుస్తోంది. కోర్టు వ్యవహారం ఉండగానే ఆ కోర్టు ఆదేశాలు కూడా లెక్కచేయని కౌన్సిలర్ గడ్డం రంగనాథ్‌ను లోబరుచుకుని తన భార్యపేరిట 2023లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారో లేదో ఏకంగా నిర్మాణం సాగించి పెద్ద భవనాన్నే ఏర్పాటుచేసుకున్నారు. తనకున్న పలుకుబడి అప్పటి ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉండటం వల్లనే ఆ కౌన్సిలర్ బరితెగించి ఏకంగా నిర్మాణాలు చేపట్టడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. అధికారం ఉంటే ఏదైనా జయించుకోవచ్చుకున్నారేమో అన్నంత పనిచేసి ఎదుట వ్యక్తికి కన్నీళ్లనే మిగిల్చారు. వీటి మాటున వాటిపక్కనే ఉన్న మరో 2 సెంట్లను మరొకరు రిజిస్టర్ చేయించుకుని వాటిని కబ్జా చేయడంతో రంగన అశ్వర్థనారాయణ, రంగన అచ్చప్ప నిట్టూర్పులు తప్ప ఏమీ చేయలేని పరిస్థితిలో పడ్డారు. అధికారులైన స్పందించి సర్వే నిర్వహించి ఆ స్థలం ఎవరిదే నిగ్గుతేల్చితే అసలు యజమాని ఎవరో బయటపడే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు.

బాలాజీనగర్ లో కబ్జాచేసిన స్థలంలో ఇంటినిర్మాణం చేపట్టిన దృశ్యం

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించండి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలని భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు అధికారులు సూచించారు. తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంఇఒ గంగప్ప శుక్రవారం రూరల్ మండలంలోని పూలకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కోడిగుడ్లు, చిక్కిలు లేనందున పాఠశాల హెచ్ఎమ్‌ను ప్రశ్నించారు. వాటినిసరఫరా చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని కస్తూరిబా స్కూల్‌ను పరిశీలన చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులందరికీ వడ్డించారు. అనంతరం పాఠశాలల్లో ఉన్న సమస్యలపై విద్యార్థినులతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

భూవివాద విషయంలో కదిరి న్యాయవాది రామస్వామి నాయుడుపై శుక్రవారం దాడి జరిగింది. భూవివాద ఘటనలో తలుపుల గంగాధర్, శ్రీనివాసులు జయ వారి మిత్రులు కలసి తనపై దాడి చేసినట్లు న్యాయవాది రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పుల్లయ్య తెలిపారు.

'మాంగల్య'ను మూసేసంత వరకూ పోరాటం

పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మాంగళ్య షాపింగ్ మాల్ ను మూసివేసేంత వరకూ పోరాటం ఆపబోమని పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం అధ్యక్షులు గిర్రాజు రవి స్పష్టం చేశారు. పట్టణంలోని నేసే పేటలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మవరంలో మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం వల్ల తమ వ్యాపారులు దెబ్బతిని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ షాపింగ్ మాల్‌ను ప్రారంభించే సమయంలో అప్పటి ఎమ్మెల్యేని కలిసి సమస్యను విన్నవించినా పెడచెవిన పెట్టి మాల్ యాజమాన్యానికే మద్దతు పలికార న్నారు. ఆ మాల్‌లో పట్టుచీరల అమ్మకాలు జరపకుం డా చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. జనసేన పార్టీ నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌తో మాట్లాడి త్వరగా షాపింగ్ మాల్‌ను మూయించి న్యాయం చేస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం చేనేత కార్మికులు, వ్యాపారులు మాంగళ్య షాషింగ్ మాల్ వల్ల నష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశం లో సంఘం సహాయ కార్యదర్శి కోటం హేమంత్ కుమార్, డైరెక్టర్లు గాండ్ల రామాంజనేయులు, పల్లా నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిర్రాజు రవి

విద్యార్థులను తరలించడానికి పాఠశాల వద్ద నిలబడిన ప్రయివేటు బస్సు

భాష్యం పాఠశాలపై చర్యలు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

రవాణా శాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండా ఓ ప్రైవేట్ వాహనంలో విద్యార్థులను తరలిస్తున్న భాష్యం పాఠశాలపై రవాణా శాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. ఓ ప్రైవేట్ వాహనంలో శుక్రవారం విద్యార్థులను తరలిస్తున్న నేపథ్యంలో పాఠశాల తీరుపై బాబావలి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రారంభం నుంచి భాష్యం పాఠశాల యాజమాన్యం కండిషన్ లేని ఓ ప్రైవేట్ వాహనంలో విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. దీనిపై రవాణాశాఖ అధికారులు పరిశీలన చేసి పాఠశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిందితులను శిక్షించే వరకూ పోరాటం

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ కొప్పుల రాజు

ప్రజాశక్తి-హిందూపురం

సంపత్ కుమార్ తండ్రిని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఇటీవల దారుణ హత్యకు గురైన ఎన్ ఎస్ యు ఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ విభాగాల సమన్వయకర్త డాక్టర్ కొప్పుల రాజు అన్నారు. మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పిసిసి కార్యదర్శి కేటీ శ్రీధర్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి డాక్టర్ కొప్పుల రాజు సంపత్ కుమార్ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించారు. సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తనవంతుగా కుటుంబానికి రూ. 1 లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజు మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన సంపత్ కుమార్ ఎంతో కష్టపడి న్యాయ శాస్త్రాన్ని చదివి, కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శిగా పనిచేశాడన్నారు. దళితుడైన సంపత్ కుమార్ ఎదుగుదలను చూసి ఓర్వలేక అగ్రవర్ణాల వారు ఇలాంటి ఘాతుకానికి వడిగట్టారని ఆరోపించారు. సంపత్ కుమార్ హత్య గురించి భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు కృషి చేస్తామన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా ప్రత్యేకంగా ఓ న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమద్ షాహిన్, శ్యామ్ కిరణ్, సాకే శంకర్, నాగ మధు, కదిరప్ప, ఖలీల్, హనుమంత రాయుడు, ఫిరోజ్, సలాం, సాబ్జాన్, ధర్మవరం అశ్వర్థ నారాయణ, పెనుగొండ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు చర్చకొచ్చేనా..?

మున్సిపల్ కార్యాలయం

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అజెండాలో కనిపించని ప్రజా సమస్యలు

వేసవి ముగిసాక సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిన అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

నాలుగు నెలల విరామం తర్వాత హిందూపురం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. కౌన్సిల్ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు 26 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ 26 అంశాలలో ముఖ్యమైన అంశాలు ఏ ఒక్కటీ లేవు. ఇది చాలదన్నట్లు సమ్మర్ ముగిశాక... అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి కౌన్సిల్ దృష్టికి తీసుకెళుతుండటం విడ్డూరంగా ఉంది.గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో 2016-2019 మధ్యకాలంలో కరువు నిధులను హిందూపురం మున్సిపాలిటీకి మంజైరు చేశారు. వాటిని అప్పటి పాలకులు నిబంధనల ప్రకారం వినియోగించారు. దీంతో తక్కువ ఖర్చు కావడంతో మున్సిపల్ ఖాతాలో ఇంకా రూ. 3.5 కోట్ల కరువు నిధులు ఉన్నాయి. ఈ నిధులతో గత సమ్మర్ లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వినియోగించాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అధికారులు మొత్తం ఎన్నికల విధుల్లో నిమగ్నం కావడంతో నిధులు అలాగే మిగిలిపోయాయి. ఈ నిధులపై పాలకుల కన్ను పడింది. ఎలాగైనా కరువు నిధులను కరిగించాలని పట్టణంలో నీటి సమస్యను తెరపైకి తెచ్చారు. రూ. 2.5 కోట్లతో వివిధ పనులు చేపట్టడానికి అధికారులు ఎస్టిమేషన్ వేశారు. గొల్లపల్లి రిజర్వాయర్ ట్యాంకుల నిర్వహణ కోసం రూ. 39.75 లక్షలు, పట్టణంలోని38 వార్డుల్లో నీటి సరఫరా పైప్ లైన్ మరమ్మతుల కోసం 40 లక్షలు, బోరు బావుల మరమ్మతుల కోసం రూ. 20 లక్షలు, బోర్ వెల్స్ పంపుసెట్లు మరమ్మతులకు రూ. 30 లక్షలు, పట్టణంలో ఉన్న ప్రైవేట్ బోర్లు అద్దెకు తీసుకోవడం కోసం రూ 10 లక్షలు, బోరు పంపు సెట్లకు డిపెనింగ్ ఫ్లస్సింగ్ చేయడానికి రూ. 20 లక్షలు, పట్టణంలోని 38 వార్డుల్లో అద్దె ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి రూ. 78.64 లక్షలు, బోరు పంపు సెట్ల నిర్వహణ నిమిత్తం లిఫ్టింగ్ మిషన్ వాహనం కోసం రూ. 5 లక్షలు. మొత్తం 2.50 కోట్ల వరకు కరువు నిధులు కరిగించడానికి ప్రణాళికను సిద్ధం చేసి అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తున్నారు. అయితే గత కొంతకాలంగా అడపాదడపా వర్షాలు పడ్డాయి. దీంతోపాటు ఈ మధ్యకాలంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఫలితంగా దోమలు విపరీతంగా పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనం, కూరగాయల మార్కెట్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు. కూరగాయల మార్కెట్ గదులు కేటాయింపులు, పరిగి బస్టాండ్ లో టోకు వ్యాపారులకు కేటాయించిన స్థలాలలో పాలకవర్గం భారీగా అవినీతికి పాల్పడింది. ఇక పట్టణ ప్రణాళిక విభాగం అవినీతిమయమైంది. ఇలా ప్రతి విభాగంలోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. ఇలాంటి సమస్యలపై అజెండాలో కనపర్చకపోవడం గమనార్హం.

కౌన్సిల్ హాట్ హాట్ గా మారే అవకాశం

నాలుగు నెలల విరామం అనంతరం టిడిపి ప్రభుత్వ హయాంలో తొలిసారిగా హిందూపురం కౌన్సిల్ సమావేశం జరగనుంది. వైసిపి పాలకవర్గం ఉన్నప్పటికీ ఉన్న ఆరుగురు టిడిపి కౌన్సిలర్లు గతంలోనే ప్రజా సమస్యలపై పాలకవర్గాన్ని నిలదీశారు. కొంతమంది వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే దానికి తగ్గట్టు టిడిపి కౌన్సిలర్లు సమాధానమిచ్చారు. ఉన్న టిడిపి ఆరుగురు కౌన్సిలర్లు కరువు నిధులతో పాటు ప్రజా సమస్యలపై పాలకవర్గాన్ని నిలదీసే అవకాశాలు ఉన్నాయి. దీంతో శనివారం జరిగే కౌన్సిల్ హాట్ హాట్ గా ఉండబోతుంది.

జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ శ్రీ సత్య సాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెంకటరమణ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర కుమార్, అనంతపురం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎర్రిస్వామి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హనుమేష్, తులసి రెడ్డి హాజరైనారు. ఈ సమావేవంలో శ్రీ సత్య సాయి జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఆనంద్, అధ్యక్షులుగా పూజారి రెడ్డప్ప, ఉపాధ్యక్షులుగా గంగులప్ప, సునీల్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా డిసిహెచ్ గోవిందు, సంయుక్త కార్యదర్శిగా కే బాబు, ఆర్థిక కార్యదర్శిగా విజయ్ కుమార్, కార్యదర్శిగా రమేష్ బాబు, రఘుపతి, సలహాదారులుగా జి శ్రీనివాసులు, అబ్దుల్ నిసార్, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండితుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన నూతన కార్యవర్గాన్ని సన్మానం చేస్తున్న దృశ్యం

చేనేత పరిశ్రమ అభివృద్ధికి కృషి

బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

చేనేత పరిశ్రమ బాగుంటేనే ఆప్కో రంగం మరింత మెరుగుపడుతుందని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. మంత్రి శుక్రవారం పెనుకొండ నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే పక్కనే ఉన్న బాలికల కళాశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల పని తీరుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించి అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మీ ఇళ్లలో అయితే ఇలాగే ఉంచుకుంటారా అంటూ మండిపడ్డారు ఇక నుంచి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ చేనేత రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామన్నారు. చేనేత వస్త్రాలను అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఆప్కో షోరూం లు మరిన్ని తీసుకొస్తామన్నారు. వారంలో ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని మంత్రి కోరారు.

పెనుకొండను సుందర పట్టణంగా తీర్చిదిద్దుదాం

పెనుకొండ నగర పంచాయతీని సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ సమావేశ భవనంలో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. రాజకీయాలను ఎన్నికల వరకే చూడాలన్నారు. పార్టీలకు అతీతంగా నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని కౌన్సిల్ సభ్యులకు సూచించారు. పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరిందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. దశల వారీగా డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. రాజకీయాలకతీతంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో సమస్యలు పరిష్కరిస్తామని, కౌన్సిల్ సభ్యులు సహకరించాలని కోరారు. ఛైర్మన్ ఉమర్ ఫరూక్ మాట్లాడుతూ నగర పంచాయతీలో సిబ్బందిని నాయమించాలని, అమృత్ పథకం కింద కేంద్రం రూ. 87 కోట్లు మంజూరు చేసిందని ఆ పథకం కార్యరూపం దాల్చేందుకు కృషి చేయాలని, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, వైస్ ఛైర్మన్ సునీల్ కుమార్, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, రామాంజనేయులు, తయూబ్, సద్దాం, శేషాద్రి, గిరి, గీత, హనుమంతు, కోఆప్షన్ సభ్యులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

మంత్రికి వినతుల వెల్లువ

మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న ఎంఇఒ-2 సంఘం నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఎంఇఒ-1లాగే ఎంఇఒ-2లకు సైతం సమాన హోదా, అధికారం కల్పించాలని జిల్లా ఎంఇఒ-2 సంఘం అధ్యక్షులు బొల్లె ప్రసాద్ బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవితకు విన్నవించారు. ఆయన శుక్రవారం పెనుకొండలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఎంఇఒ-2ల సమస్యలను ఆమెకు వివరించారు. వీటిపై స్పందించిన మంత్రి ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు మంత్రిని ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవిచంద్ర, ట్రెజరర్ గోపాల్, సుధాకర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తా : మంత్రి సవిత

సోమందేపల్లి : రాష్ట్రంలోని పేద కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కళాకారుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల సరోజమ్మ, జిల్లా అధ్యక్షురాలు మల్లెల లక్ష్మీప్రసన్న, శ్యామల, చందునాయక్, అంజి, ప్రదీప్, రవికుమార్, రమేష్ తదితరులు శుక్రవారం పెనుకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంత్రిని కలిసి కళాకారుల సంఘం తరపున శాలువా కప్పి పూలబొకే అందజేసి సత్కరించారు. అర్హులైన కళాకారులకు పింఛను, ఇంటి స్థలాలు, ఇళ్ల నిర్మాణం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు.

సోమందేపల్లి : మండల వ్యాప్తంగా ఉన్న పాడి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఎపి రైతు సంఘ జిల్లా నాయకులు హరి, మండల రైతు సంఘ నాయకులు కురుబ భాస్కర్ ఆధ్వర్యంలో బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ, బీరప్ప, సురేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి బిసి ఉద్యోగుల సంఘం సన్మానం

ధర్మవరం టౌన్ : బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను శుక్రవారం ధర్మవరం బిసి ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అలాగే వారి సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, బలరాముడు, బికె.ముత్యాలప్ప, ఉరుకుందప్ప, మల్లికార్జున, ఆకులేటి వెంకటేశ్వర్లు, ప్రకాశ్, చంద్రశేఖర్, బండి శ్రీనివాసులు ఉన్నారు.

కండీషన్ లేని బడి బస్సులు సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మడకశిర

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నియోజకవర్గ వ్యాప్తంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేని ప్రయివేటు విద్యాసంస్థల బడి బస్సులను సీజ్ చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయివేటు విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అందులో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మండల విద్యా శాఖ అధికారులు మామూళ్లు పుచ్చుకొని అనుమతి మంజూరు చేస్తున్నారన్నారు. బడి బస్సులను కొన్నేళ్ల నుంచి అలానే నడుపుతున్నారని, పరిశీలించి ఫిట్ నెస్ లేని వాటిని సీజ్ చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వినతి ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఆది ఉన్నారు.

టిడిపి పట్టణ నూతన కన్వీనర్ల ఎన్నిక

పట్టణ నూతన కన్వీనర్లతో మంత్రి సవిత

పెనుకొండ టౌన్ : పెనుకొండ పట్టణ టిడిపి నూతన కన్వీనర్‌గా శ్రీరాములు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు శ్రీరాములు యాదవ్‌ను టిడిపి పట్టణ అధ్యక్షుడిగా, పట్టణ మహిళా అధ్యక్షురాలిగా మాజీ ఎంపిటిసి రమణమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంత్రి మాట్లాడుతూ శ్రీరాములు, రమణమ్మ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు రఘువీరాచౌదరి, అశ్వర్థనారాయణ, దాదు, షౌకత్, హనుమంతు, మాజీ సర్పంచి సుబ్బు, చంద్రకాంతమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కొత్తచెరువు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా కృషి చేయాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి మహేందర్‌రెడ్డి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కొత్త చెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి గల కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించి పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ జయచంద్ర పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం టౌన్ : జులైలో జరిగే అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు పట్టణంలోని యశోద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. గత జనవరి 13, 14 తేదీల్లో తెలంగాణలోని సిద్ధిపేట జిల్లాలో జరిగిన నేషనల్ మీట్‌లో పదో తరగతి విద్యార్థులు తన్మయి శ్రీచరణ్, యశ్వంత్ కుమార్ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు జులై 8 నుంచి 11వ తేదీ వరకూ నేపాల్‌లో జరిగే పోటీలోల పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపల్ అనూఫ్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ఉచిత వైద్య శిబిరానికి విశేషస్పందన

కదిరి టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ రేణుకరెడ్డి తెలిపారు. రేణుక హాస్పిటల్‌లో శుక్రవారం బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ వైద్యునిపుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. హాస్పిటల్ నిర్వాహకులు వైద్యులు అశోక్‌రెడ్డి, రేణుకరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా రెండు, నాలుగు వారాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డులో డ్రెయినేజీలు శుభ్రం

డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్న టిడిపి నాయకులు

ధర్మవరం టౌన్ : పట్టణంలోని 33వ వార్డులో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో వార్డు టిడిపి ఇన్‌ఛార్జి గోసల శ్రీరాములు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి శుభ్రం చేయించారు. డ్రెయినేజీల నుంచి వచ్చే దుర్వాసనతో పాటు ఆ నీరు రోడ్లపైకి ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో గోసల శ్రీరాములు టిడిపి నాయకులు కేతినేని రాజు, నాగేంద్ర, మున్సిపల పారిశుధ్య కార్మికులతో డ్రెయినేజీలు శుభ్రం చేయించారు.

డయేరియాపై కెజిబివి విద్యార్థినులకు అవగాహన

ముదిగుబ్బ : స్థానిక కస్తూరిబా గురుకుల బాలికల విద్యాలయలో శుక్రవారం పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థినులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కలుషిత నీరు, జంక్ ఫుడ్, వ్యక్తిగత పరిశుభ్రత, దోమలు, ఈగల నివారణపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకుని ఆహారం తినాలన్నారు. కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ ఫకృబి, సిహెచ్ఒ స్వర్ణలత, కెజిబివి, ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

రొద్దం : మండలంలోని ఎల్‌జిబి నగర్‌కు చెందిన వైసిపి సీనియర్ నేత శ్రీరామరెడ్డి అనా రోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ శుక్రవారం వారి గ్రామం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తురకలాపట్నం సర్పంచి నరేంద్రరెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

మడకశిర : మండలంలోని గుండుమల కెజిబివిలో శుక్రవారం మాజీ సర్పంచ్ చంద్రప్ప ద్వారా విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. చంద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో అత్యున్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఒ, అధ్యాపక బృందం, స్కూల్ కమిటీ మాజీ ఛైర్మన్ కోట్ల రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

కదిరి అర్బన్ : ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ శుక్రవారం పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు. పట్టణంలోని 29 వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారన్నారు. కార్యక్రమంలో 25వ వార్డు ఇన్‌ఛార్జి కటిక ఖాదర్‌బాషా, నాయకులు బాబుల్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమణ, సెక్రటరీలు పరమేశ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తి మున్సిపల్ సమావేశం

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ అత్యవసర కమిటీ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా అక్కదేవతల యలవగంప ఊరేగింపు

ఓబుళదేవరచెరువు : మండలంలోని పగడాలవారిపల్లిలో శుక్రవారం పూజారి పెద్ద నారాయణప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అక్కదేవతలకు యలవగంప కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, గాజులు, తదితర పూజా సామగ్రితో కూడిన యలవగంపను ఉరుములు, వాయిద్యాల మధ్య ఊరేగించి అక్కదేవతలకు సమర్పించారు. అక్కదేవతల ప్రతిరూపంగా ఏడుగురు చిన్నారులకు ఒళ్లు నింపే కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఒడిసిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు : 'మా' మెడికల్ స్టోర్స్ ఆధ్వర్యంలో అల్ట్రా విజన్ ఐ కేర్ సహకారంతో శనివారం(నేడు) స్థానిక బీమా మెడికల్ స్టోర్ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మా మెడికల్ స్టోర్ ఫిరోజ్ తెలిపారు. వివరాలకు 97044 61510, 63024 04132 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

నూతన చట్టాలపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్పీ విష్ణు

జులై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలులోకి రానున్న నేపథ్యంలో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎఎస్పీ ఎన్.విష్ణు సూచిం చారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు నూతన చట్టాలపై జిల్లాలోని పోలీస్ అధికారులకు పుట్టపర్తి ఐటి కోర్ టీంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పుట్టపర్తి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి నూతన చట్టాలపై ఎఎస్పీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించి, కొత్త, పాత చట్టాల్లో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలుంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఐటి కోర్ టీం సుదర్శన్‌రెడ్డి, సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో గార్మెంట్స్ ఫ్యాక్టరీ ప్రారంభం

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి

ఫ్యాక్టరీ ఎండిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో త్వరలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. పట్టణంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధిగాం చిన ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీ ప్రధాన కార్యాలయమైన బెంగళూరులో ఉన్న ప్లాంట్లను పరిశీలించి గార్మెంట్స్ అధినేత జావేద్, సల్మాన్, ఎండి సలహాదారుడు సోమశేఖర్‌తో చర్చించామన్నారు. త్వరలోనే మడకశిరలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీని ప్రారంభించి నియోజకవర్గ వ్యాప్తంగా 3వేల మందికి ఉద్యోగావకాశం కల్పిస్తామని తెలిపారు. వారితో పాటు మండల కన్వీనర్ దాసిరెడ్డి, రామకృష్ణ ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి టిడిపిలో చేరిక

మండలంలోని మాజీమంత్రి రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వర్ ప్రసాద్, నరష్, గోవర్ధన్, రమేష్, ఆనంద్, ఆంజనేయులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

కార్యకర్తలకు గుండుమల పరామర్శ

రొళ్ల మండలంలోని దొడ్డేరి మాజీ ఎంపిటిసి చంద్రప్ప అనారోగ్యంతో, అమరాపురం మండలంలోని పేలుబండ గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త రంగనాథ్ బెంగళూరులోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, మహేష్, రామకృష్ణ ఆసుపత్రికి వెళ్లి వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

నామినేటెడ్ పదవులపై నాయకుల ఆరాటం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో కొత్తగా టిడిపి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా స్థానిక నాయకులు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ పదవులతో పాటు పుడా ఛైర్మన్, పార్టీ మండల, పట్టణ కన్వీనర్, సింగిల్‌విండో అధ్యక్షులు, కొందరు మున్సిపాలిటీ ఛైర్మన్ పదవిపై కన్నేశారు. మున్సిపాలిటీతో పాటు సింగిల్‌విండో లాంటి పదవులకు ఇంకా సమయం ఉంది. అయితే మున్సిపాలిటీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 15 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. ఇంకో ఏడాదికి పైగా సమయం ఉంది. అయితే ఆలోపే కొందరు వైసిపి కౌన్సిలర్లను టిడిపిలోకి చేర్చుకుంటే మున్సిపల్ ఛైర్మన్ సీటు తమదే అవుతుందని టిడిపి శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఇందుకు కొందరు నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇంకొందరు పుడా ఛైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా గడిచిన ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన రామ్, లక్ష్మణ్‌లో ఒకరైన లక్ష్మీపతి ఈ పదవిని ఆశిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పట్టణ టిడిపి కన్వీనర్ రామాంజనేయులు కూడా కన్నేసినట్లు సమాచారం. మరికొందరు పార్టీ మండల, పట్టణ కన్వీనర్ల పదవుల కోసం ఆరాటపడుతున్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్లు పిసి.గంగన్న, బెస్త చలపతి కూడా పదవులపై ఆశలు పెట్టుకొన్నారు. ఆయా పదవులను ఆశిస్తున్న వారు పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పల్లె రఘునాథరెడ్డి చుట్టూ తిరుగుతున్నారు.

1 నుంచి పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి : సామాజిక పింఛన్ల సొమ్మును సోమవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 6,391 మందికి వివిధ రకాల పింఛన్లు కోసం రూ. 4,28,48,500 విడుదలైనట్లు తెలిపారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు శనివారం బ్యాంకుల్లో నగదు డ్రా చేస్తారని, రెండు రోజులు పాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పింఛను మొత్తం అందజేస్తారని తెలిపారు.

జయప్రదం చేయాలి

మడకశిర : జులై 1వ తేదీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పింఛను పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో కలిసి టిడిపి శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా టిడిపి కార్యదర్శి ఎస్.రవిభూషణ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌ఛార్జులు, పార్టీ పదవుల్లో ఉన్న నాయకులు ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలన్నారు.

క్యాస్ట్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి-బత్తలపల్లి

సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది చేపట్టిన కుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ కార్యక్రమాన్ని శుక్రవారం ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి పరిశీలించారు. బత్తలపల్లిలో విఆర్ఒలు రాణాప్రతాప్, భరద్వాజబాబు చేస్తున్న సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్‌కు సంబంధించిన క్యాస్ట్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ విధానాన్ని ఆర్డిఒ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విఆర్‌డిలు ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. ఎటువంటి తప్పిదాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజల నుంచి అందే వినతులు స్వీకరించి మార్పులు చేయాలని సూచించారు. ఆయన వెంట బత్తలపల్లి తహశీల్దార్ శివశంకర్‌నాయక్, విఆర్డిలు, విఆర్పీలు, ఉన్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు

ప్రజాశక్తి కథనానికి స్పందన

రొద్దం : మూడు రోజుల క్రితం ప్రజాశక్తిలో 'పనుల వద్ద కనిపించని ప్రమాద సూచికలు' శీర్షకన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు శుక్రవారం కల్వర్టు వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. మలుపుల్లో చిన్నపాటి ఎర్ర జెండాలు ఏర్పాటు చేశారు. పెద్దగువ్వలపల్లి వద్ద నుంచి ఆర్.మరవపల్లి మధ్యలో ఉన్న కల్వర్టుల వద్ద పంటపొలాల్లో దారి ఏర్పాటు చేశారు. అయితే రోడ్డుకు ఆనుకుని చెట్లు ఉన్నాయని, అక్కడ కూడా సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద సూచిక ఏర్పాటు చేసిన అధికారులు

సత్యసాయి ప్రాజెక్టు నీటిసంపు పరిశీలన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఎన్నికల హామీ మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చొరవతో ముదిగుబ్బలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. నీటి సమస్యపై సంబంధిత అధికారులతో రోజు సమీక్ష నిర్వహిస్తు న్నారు. అలాగే టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ శుక్రవారం ముదిగుబ్బలో పలు ప్రాంతాల్లో పర్యటించి తాగునీటి సమస్యపై ఆరా తీశారు. అనంతరం స్థానిక దొరిగల్లు రోడ్డులో ఉన్న సత్యసాయి ప్రాజెక్టుతో పాటు నీటి సంపును పరిశీలించారు. పంప్ హౌస్‌లో సమస్యలు, పెండింగ్ జీతాల గురించి సిబ్బంది ఆయనకు వివరించారు. మనోహర్ మాట్లాడుతూ ముదిగుబ్బలో తాగునీటి సమస్యపై మంత్రి సత్యకుమార్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆరు నెలల్లోగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అమర కేశవ, నంద, నారాయణస్వామి, రంగనాయకులు, సూర్యనారాయణ, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ

తనకల్లు : మండలంలోని కొక్కంటి పిహెచ్‌సి, కోటపల్లి సబ్ సెంటర్ లను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. డిపిఒ నాగరాజు, ఐడిఎస్‌పి సుబ్బారావు, కొక్కంటి మెడికల్ ఆఫీసర్ లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాటిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రక్తం తక్కువగా వున్న వారికి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని తల్లులకు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ సూర్యనారాయణరెడ్డి, ఎఎన్ఎం పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పి చందన, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రహ్మణ్యం, మోహన్‌రెడ్డి ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిపందెం జూదరుల అరెస్టు

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో మెరుపుదాడులు నిర్వహించారు. గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ పోలీసు సిబ్బందితో దాడులు చేసి 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 28,150 నగదుతో పాటు కోడి కాళ్లకు కట్టే కత్తులు 5, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను ధర్మవరం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

మడకశిర : టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుయాదవ్‌ని శుక్రవారం విజయవాడలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ మీ సమర్థ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నానని తెలిపారు. అలాగే విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను టిడిపి కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి ఎస్. రవిభూష ణ్, మాజీ మండల కన్వినర్ రామాంజనే యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు పల్లె రఘునాథరావులతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవరుపై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు బహుమతి సముచిత రీతిలో బహూకరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ